
కథ




# ఆయుధం

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

కేన్సర్ బారినపడి కృశించిపోయి 'నేడో రేపో' అన్నట్టుండే రోగి పరిస్థితిలా వుంటుంది మా ఆఫీసు. ఆఫీసంటే మా అందరికీ ఆటవిడుపు. ఒక్కళ్లం టైముకి ఆఫీసుకి రాము. ఒక వేళ వచ్చినా, సంతకం పెట్టి బయటకెళ్లిపోతాం! ఎవరన్నా ఆఫీసులో కాలం గడుపుతున్నారంటే...దానికి కారణం పని మీద శ్రద్ధకాదు.. ఉద్యోగమంటే భక్తికాదు.. ఇంటికన్నా ఆఫీసు పదిలం అనుకునే రకాలవి. మావంక జి.ఎం. బేలగా చూస్తాడు...మేనేజర్ దీనంగా చూస్తాడు. మా చేత పని చేయించుకోవడం ఎవరివల్లా కాదు. ఈ విషయంలో పబ్లిక్ సెక్టార్‌తో పోటీ పడుతుంది మా ఆఫీసు. మెమోలివ్వడం..ఇంక్రిమెంట్లు డౌన్ చేయడం లాంటివెన్నో చేశారు. మొదట్లో..

కాని ఒక్కరిద్దరు అలాంటివాళ్లుంటే అనుకోవచ్చు...ఆఫీసులో అలాంటి వాళ్లతోటే నిండి వుంది. అడుగడుగునా నిర్లక్ష్యం...అలసత్వం..ఏం చేయలేక చేష్టలుడిగి చూస్తుంటే వాళ్ళు...ఎప్పుడన్నా అర్జంట్ వర్క్ వస్తే 'అమ్మా..బాబూ' అని బ్రతిమిలాడి చేయించుకోవాలి తప్పితే ... ఏనాడూ బాధ్యతగా చేసి ఎరగము...హెడ్డాఫీసు మా బ్రాంచిని ఎప్పుడో ఇగ్నోర్ చేసింది. మా విషయంలో ఆఫీసంటే శాలరీస్ ఇవ్వడానికే తప్ప..పని చేయించుకోవడానికి మాత్రంకాదు.

మా ఆఫీసులోపలి వాతావరణం ఎలా వుంటుందో చూడండి.'ఇన్' ట్రేలో వున్న ఫైల్స్ గుట్ట వెనకాల వెంకట్రావు గురక బెంజిలారీ శబ్దంలా విన్పిస్తుంది. క్రికెట్ సీజన్ అయితే క్రికెట్..లేదంటే ఏదో ఓ కార్యక్రమంతో చిన్న ట్రాన్సిస్టరొకటి శ్రీనివాస్ చెవులకి సదా అంటుకునుంటుంది. గోవిందరావుగారైతే సాక్షాత్తు విష్ణుమూర్తే! పాలకడలిపై శేషశయనుడైనట్టు..టేబిల్ మీద కాళ్లు బారచాపుకుని పడుకుంటాడు. టైపిస్ట్ లక్ష్మి అయితే ఏదో ఒక నవల దీక్షగా చదువుతూ..అందులోని భావాల్ని ముఖంపై కనబరుస్తూంటుంది. నేనైతే కొత్తగా రిలీజయిన సినిమాల బాగోగుల గురించి కనకాంబరంతో సమీక్షిస్తుంటాను. మా అటెండర్ రామగోపాల్..ఆఫీసులో ఫైల్ 'ఇంచ్' కదపడానికి ఇష్టపడడు గాని...మాకు కిళ్లీలు..సిగరెట్లు..టీలు తేవడానికి బయటికి లోపలికి ఎన్నిసార్లైనా తిరుగుతాడు! ఎందుకంటే వాటిల్లో అతనికి వాటా ఉంటుంది..అదీగాక ఆఫీసులో కూర్చోమంటే ముళ్ళమీద కూర్చున్నట్టు భావిస్తాడు..బయటి వాతావరణమంటే బహుప్రీతి!

ఒకరోజు మా మేనేజర్ మా దగ్గరకొచ్చి కంపెనీ టర్నోవర్ పెరగాడానికి వచ్చే మూడు నెలల్లో చాలా హార్డ్‌వర్క్ చేయాలని..దయచేసి అందరూ సహకరించాలని..మా వంక రిక్వెస్ట్‌గా చూశాడు..మేము రెక్లెస్‌గా చూశాం. ఆయనికి మా భావం అర్థమయింది. జుట్టుపీక్కుని..కళ్ళజోడుతీసి గట్టిగా కళ్ళు వత్తుకుని..ఇంకేదో చెబుదామనుకున్నాడు. ఆ సరికే మా 'పనుల్లో' మేము లీనమయిపోయాం. చేసేదేం లేక జి.ఎం. కాబిన్ లోకి వెళ్లాడు. ఆయనతో దీర్ఘంగా చర్చించడానికి కాబోలు.

జి.ఎం. బైటకి వచ్చి "ఈ ఆర్డర్ సక్సెస్ చేస్తే..అబ్రోడ్‌నుంచి పెద్ద ఆర్డర్ ఎక్స్‌పెక్ట్ చెయ్యొచ్చుట. అంతేకాక ఈ మూడునెల్ల హార్డ్ వర్క్‌తో మా కంపెనీ టర్నవర్ అమాంతం బి.పి. పెరిగినట్టు పెరుగుతుందట..ఆఖరి అస్త్రంగా ఇంక్రిమెంట్లు.. ప్రమోషన్లు తాయిలం చూపెట్టాడు. ఒకవేళ చెయ్యలేకపోతే తన పదవికి ప్రమాదకరమని..తన పరువు కాపాడుమని ప్రాధేయపడినంత పనిచేసి ఒప్పిద్దామనుకున్నాడు..మేము కూడా పోన్లే పాపం ఈసారికి పనిచేసి పెడదామనుకున్నాం..కాని ఒళ్ళొంచి పనిచేయడమెరగని మేము .. సుఖానికి అలవాటైన మాకు, పని 'భూతంలా' కనిపించింది..హాయిగా కడుపులో చల్ల కదలకుండా..కష్టపడకుండా జీతాలొస్తుంటే..ఇంక్రిమెంట్లు ఎందుకనిపించింది. పైగా పరిగెత్తి పాలు తాగేకంటే నిలబడి నీళ్లు తాగడం ఉత్తమమన్న సామెత ఉండనే ఉంది కదా! అందుకని పని చెయ్యమని మొరాయించాం.

రెండ్రోజుల తర్వాత ..'ఈ బ్రాంచి ఉద్యోగులతో టర్నోవర్ సాధించడం అసాధ్యమని..అర్భకుడు ఎవరెస్ట్ ఎక్కడం లాంటిదని..వీళ్ళతో పని చేయించడం కన్నా..ఎడారికి ట్రాన్స్‌ఫర్ అయినా..ఆనందంగా బ్రతుకుతానని..ఈ విషయంలో అసమర్థుడనని 'జి.ఎం. హెడ్డాఫీసుకి ఫాక్స్ పంపాడని మాకు న్యూస్ తెలిసింది. ఆపరేటర్ కూడా మా వాడేగా..అందుకే మెసేజ్ అలా లీకయింది.

మాకు విజయగర్వం కలిగింది. మా 'పని దొంగల' ఐకమత్యానికి మాకే ముచ్చటేసింది.

వారం గడిచింది.

మేమందరం రౌండ్ టెయిర్స్ కాన్ఫరెన్స్ పెట్టుకుని హాస్యోక్తులు..ఛలోక్తులతో కాలం గడుపుతున్నాం.

ఒకరోజు మా ఆఫీసుముందు ఆటో ఆగింది.

అందరి కళ్ళు దానివైపు చూశాయి.

ఆటోలోంచి దిగిందో మెరుపుతీగ..ఆకాశం సగంగా చీలి..ఇంద్రధనుస్సు మీదుగా జారివచ్చినట్టుంది...తిన్నగా నడుచుకుంటూ వచ్చి "జి.ఎం.గారి కేబిన్ ఏది?" ఎర్రని పెదాలు కదుపుతూ..తియ్యాగా అడిగింది.

మేమందరం 'నేనంటే నే నన్నట్టుగా'

## అమీష-కరీనల గొడవ!

కరీనాకపూర్ నటించిన 'యాదే' ఫ్లాప్ కావటం, అమీషాపటేల్ నటించిన 'గదర్' సూపర్‌హిట్ కావటం అందరికీ తెలుసు. కరీన నటుల వంశంలో పుట్టింది. అమీషకు తను నటించిన సూపర్‌హిట్లు కావటంతో పేరొచ్చింది. ఇద్దరూ కూడా పెద్దగా చదువుకోలేదు. కరీనకు నటన మంచినీళ్ల ప్రాయమైతే, అమీష నటన నేర్చుకుంది. కరీనను టాప్ హీరోయిన్‌గా అందరూ భావిస్తున్నారు కానీ, అమీష తన కృషితో టాప్‌కు చేరుకుంది.





ఇద్దరితోనూ కలిసి పనిచేసిన యువ మెగా హీరో హృతిక్‌రోషన్ దృష్టిలో "అమీష బెస్ట్ నటీమణుల్లో ఒకతె. ఆమెతో నాకున్న బంధం మిగిలిన ఏ హీరోయిన్లతోనూ వుండదు. కరీన సహజనటి, శ్రమించకుండానే నటించగలదు. ఇద్దరూ కష్టపడి పని చేస్తారు." మొదట్లో కరీన 'కహో నా ప్యార్ హై'లో చేయటానికి ఒప్పుకోకపోయినా ఇవాళ హృతిక్ చేస్తున్న చిత్రాలన్నింటిలోనూ వుంది. కానీ హృతిక్ స్టేట్‌మెంటు అమీషకు అనుకూలంగా ఇచ్చేసరికి కరీన పాపం, మండిపడుతూందిట. ఇవాళ పెద్ద బ్యానర్లు లేకపోయినా, హృతిక్‌రోషన్‌తో చేసే అవకాశం కూడా లేకుండా చేసింది అమీషకని చెప్పుకుంటున్నారు. ఇది చిలికి చిలికి ఎలాగవుతుందోనని కొందరు కుతూహలంతో ఎదురుచూస్తుంటే, మరి కొందరు సానుభూతి చూపుతున్నారు అమీషకు.

ఎస్.

జి.ఎం.కాబిన్‌వైపు చేతులు చూపించాం. ఆమె 'థాంక్స్' చెప్పి..హైహీల్స్ టకటక చప్పుడు చేసుకుంటూ జి.ఎం. కాబిన్‌లోకి ఎంటర్ అయింది.

మా అందరికీ తెగ ఉత్కంఠగా ఉంది. 'ఆమె ఎవరు? కొంపదీసి కొత్తగా రిక్రుట్ అవ లేదు కదా! అలాగయితే బాగుణ్ణు..భగవంతుడా..మాకోరిక తీరిస్తే..మా ఆఫీసు వీధిలో వున్న వేంకటేశ్వరస్వామి గుడిలో కొబ్బరికాయ కొడతాం'.. మగాళ్ళందరి మనస్సులో ఇదే ఆలోచన. ఆమెని నఖశిఖ పర్యంతం గమనించిన మేము ఆమెకి పెళ్ళి కాలేదని గ్రహించాం. అందుకే ఆశ.

కొద్ది సేపటికి జి.ఎం. నవ్వుతూ బయటికొచ్చి "ఈమె పేరు మిస్ నందిని..హెడ్డాఫీసు నుండి ఇక్కడకి డెప్యుటేషన్ మీద వచ్చింది. ఈరోజు నుండి మీ కొలీగ్..ఈమెకు కంపెని వర్క్సులో సహకరించండి.." అని "మీట్ మిస్టర్ శ్రీనివాస్.." అంటూ అందర్ని పరిచయం చేశాడు.

నందిని మాతో చాలా కలివిడిగా వుండేది.

ఎప్పుడూ శ్మశాన నిశ్శబ్దం తాండవించే మా ఆఫీసుకి వసంత కళ వచ్చింది. అందరం చక్కా టైంకి వచ్చి సీట్లలో కూర్చుంటున్నాం. ఆమె దృష్టిని ఆకర్షించాలి కాబట్టి, పని చేస్తున్నాం. (మేము పనిమంతుల మని తెలియాలని మా తాపత్రయం!) ఆమె అర్జెంట్ పని చెయ్యబోతే..లాక్కుని మరీ చేసేవాళ్ళం. నందిని నవ్వుతూ జోక్స్ చేసేది. ఆమెతో అన్నింటికన్నా మాకు (మగాళ్ళకి మాత్రమే) నచ్చేది. .'యూనాటీ'.. అంటూ వీపు మీద చరచి మాట్లాడ్డం...ఆడాళ్ళు అంత ఇంటిమసిగా ఉంటే...మగాళ్లకి అంతకన్నా ఏం కావాలి? ఆడాళ్లకి మాత్రం ఆమె 'మితిమీరిన చనువు' వుండుమీద కారం రాసుకున్నట్టుగా ఉండేది.

ఆఫీసు అవర్స్ ఎయిట్ అవర్స్ కాకుండా..ట్వంటీఫోర్ అవర్స్ వుంటే బాగుణ్ణనిపించేది. కూర్చుని చేస్తే ఫైల్లుకూడా కదులుతాయి కదా... అన్నీ క్లియర్ అయిపోయాయి. మాలో ఎవరో ఒకర్ని ప్రేమిస్తోందని బాచిలర్సైన మేము..ఒక ఛాన్స్ ఇవ్వకపోతుందా? అని మారీడ్ మగాళ్లందరూ గొడ్డులా పని చేస్తున్నారు.. పని చేయకపోతే లాసయేది తామేనని ఆడాళ్ళు..మొత్తానికి అందరం పని చేస్తున్నాం. పనిలో మునిగిపోయాం.. ఆమె రాక అటెండర్ రామగోపాల్‌లో కూడా మార్పు తెచ్చింది. వెయిట్ లిఫ్టర్‌లా ఎన్ని ఫైల్సున్నా అవలీలగా మోసేస్తూ..చిటికలో టేబుల్ నుండి టేబుల్ కి అందిస్తున్నాడు. మొత్తానికి మేమందరం మంచి ఉద్యోగస్థులమయిపోయాం. మాది మంచి బ్రాంచి అయిపోయింది. తెలియకుండానే టార్గెట్ కంప్లీట్ అయిపోయింది. అందరికీ ఇంక్రిమెంట్స్, ప్రమోషన్లు అందాయి. మా జి.యం. ట్రాన్స్‌ఫరై.. ఆయన ప్లేస్‌లో చండశాసనుడు జి.ఎం.గా వచ్చాడు. ఇపుడు మేము ఒకరోజు లీవ్ పెట్టినా నమిలి మింగేస్తున్నాడు. ఆయన కాబినో పులి గుహ. ఆయనో పెద్ద పులి.

నందిని 'మాలో ఎవర్ని ఇష్టపడుతుందో' తెలుసుకోవాలనుకున్నాం. కాని ఆమె రెండ్రోజుల నుండి ఆఫీసుకి రావడంలేదు. ఎందుకో అర్థం కాలేదు.

'ఆమె హెడ్డాఫీసుకి వెళ్ళి పోయిందట, అదుపు తప్పిన మా ఆఫీసుని లైన్లో పెట్టడానికి హెడ్ అఫీస్ ప్రయోగించిన ఆయుధమట ఆమె. మా అందర్ని పనిచేసేలా చేసి కళ్ళాలు బిగించి చండశాసనుడి చేతికిచ్చి వెళ్ళిపోయింది. మాతో గొప్పగా ఆడుకుంది. అందమైన సేల్స్‌గాళ్‌ని పెట్టి సేల్స్ పెంచుకున్నట్టుగా కత్తిలాంటి పిల్లని మాపై ప్రయోగించారు. బ్రాంచిలో మార్పుని తీసుకొచ్చారు. ఆమె చేసిన పనికి కోపమొచ్చి పని చేయమని భీష్మించుకుని కూర్చున్నాం.

జి.ఎం. ఎర్రకళ్ళతో క్రోధంగా బయటికొచ్చి పిచ్చిపిచ్చి వేషాలేస్తే తోకలు కట్ చేస్తాను. పనికి రాని వాళ్లని ఏరిపారేయడానికి హెడ్ ఆఫీసు నుండి స్పెషల్ పర్మిషన్ తీసుకుని మరీ వచ్చాను, ఒళ్ళొంచి పని చేశారా పచ్చగా ఉంటారు. లేదా డిస్మిస్ చేసేస్తాను. ఏమనుకుంటున్నారో...ఆఁ" అని మామీద రంకెలేశాడు.

ఇపుడందరూ బుద్ధిగా పని చేసుకుంటున్నారు. కాని ఎపుడన్నా నందిని కనిపిస్తే మాత్రం కరకర నమిలి మింగేస్తాం!

■

## బాలీవుడ్‌లోకి మరో దక్షిణాది నటుడు

అతనే 'సఖి' ఫేమ్ ఆర్. మాధవన్. 'సఖి' తరువాత 'చెలి'తో మరోమారు తెలుగు ప్రేక్షకులను పలకరించాడు. ఇప్పుడు వాసూభగ్నానీ వంటి గొప్ప దర్శకుని చిత్రం 'రహనా హై తేరే దిల్ మేఁ'లో దియామిర్జా, సయీఫ్‌అలీఖాన్‌లతో చేస్తున్నాడు. తరువాత వివేక్‌వాస్వానీ చిత్రం 'దిల్ విల్ ప్యార్ వ్యార్'లో చేస్తున్నాడు. దీని దర్శకుడు అనంత్‌మహాదేవన్.



"హిందీ కూడా తమిళమంత బాగానూ మాట్లాడగలను కనుక ఏం పరవాలేదు. పోయిన ఏడాది ఏడు చిత్రాలు ఒక్కసారిగా పూర్తి చేయాల్సివచ్చింది. నాలుగు విడుదలయ్యాయి, తక్కినవి రెడీగా వున్నాయి. రెండు హిట్లిస్తే ఒక నటుడు నంబర్ వన్నైపోతాడు. తరువాత ఒకటి ఫ్లాపైతే ఇక నంబర్ టెన్నా? ఇదే నాకు నచ్చనిది. ఎవరి ప్రతిభ వారిది. ఫ్లాపులతో లెక్క కడితే ఎలా? ఆ లెక్కన నేను మణిరత్నం, బాలచందర్ వంటివారి చిత్రాల్లో పని చేస్తున్నాను కాబట్టి ప్రొఫెషనల్‌గా నంబర్ వన్‌ను అనే చెప్పుకోవాలి. వారి చిత్రాల్లో చేస్తే హీరోయిన్ ఎవరనే ప్రసక్తే వుండదు, ప్రాజెక్టే ముఖ్యం. మణిరత్నం గారు చెబితే నేను ఓ దీపస్తంభంతోనైనా రొమాన్సు చేస్తాను" అంటున్నాడు మాధవన్ ధీమాగా. కానీ ఇప్పుడు కొందరు మాధవన్‌ను నేటి బాలీవుడ్ సూపర్‌స్టార్ హృతిక్‌రోషన్‌తో పోలుస్తున్నారు. "నేనూ, హృతిక్‌రోషన్ సూపర్ హిట్లిచ్చాము, ఆ పోలిక అంతటితో సరి! అతనికున్న అసెట్సు-తళ్లు కానీ, ఫిజిక్ కానీ నాకు లేవుగా! అతను దేశమంతా తెలిసినవాడు, నేను కాదు" అన్నాడు నిర్మొహమాటంగా. అలా వుండాలి స్పిరిట్ అంటే!

ఎన్.